అవీఇవీ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో హై టెన్షన్ వైర్ల మరమ్మతులో భాగంగా గురువారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్ ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. క్రిస్టియన్ కాలనీ, సివిల్ హాస్పిటల్ వెనుక వైపు, సీడీఆర్ హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల నమోదు (అపార్)ను తప్పనిసరని ఎంఈవో రవీందర్ అన్నారు. బుధవారం కరీంనగర్ రూరల్ మండల ఎమ్మార్సీలో ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమా వేశంలో మాట్లాడారు. విద్యార్థులు రోజు విధిగా స్కూల్ యూనిఫాం, షూ ధరించేలా చూడాలన్నారు. అనంతరం మండలంలోని నగునూర్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు.

గణేశ్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల విధి విధానాల్లో మార్పులు రావాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి కర్ర జగన్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్ స్క్రూటీనిలో అధికార పార్టీ అభ్యర్థులు విత్‌డ్రాలు ఎందుకు చేసుకోరని ప్రశ్నించారు. స్వతంత్ర అభ్యర్థులను మాత్రమే విత్‌డ్రా చేయించే ప్రయత్నం చేస్తారన్నారు. తాను ఎవరి మీదా ద్వేషంతో పోటీ చేయడం లేదని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పోటీలో ఉన్నానని తెలిపారు.

గణేశ్‌నగర్: రాంనగర్‌లో సీహెచ్ రాజీవ్ మెమోరియల్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ రాంనగర్ మార్క్‌ఫెడ్ ఎదుట క్లబ్ సమక్షంలో నూతనంగా సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు ప్రమోద్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: జిల్లా షెడ్యూల్డ్ క్యాస్ట్ డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌చార్జి)ని నేషనల్ హ్యూమన్ రైట్స్ సామాజిక సేవ సామాజిక న్యాయం చేంజ్ ఫర్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ పుస్తకాన్ని బహూకరించారు. జిల్లా అధ్యక్షుడు జట్టిపల్లి అనిల్, జిల్లా ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

భగత్‌నగర్: సీపీఐ బలపరుస్తున్న కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం కరపత్రం విడుదల చేశారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: నగరంలోని ఎస్సారార్ కళాశాలలో బుధవారం గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీసు గణిత శాస్త్రవేత్త డాక్టర్ మేరియా హౌసింగ్ కోలా మాట్లాడుతూ విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించడంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

యూరియా.. ఏదయా?

- సహకార సంఘాలకు సరఫరాలో జాప్యం
- ఆందోళనలో రైతన్నలు



దుర్శేడ్ వ్యవసాయ సహకార సంఘం భవనం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో యాసంగి పంటలు సాగు చేసిన అన్నదాతలను సమస్యలు వెంటాడుతున్నాయి. ఓవైపు సాగునీరందక ఆందోళన చెందుతున్న రైతులను యూరియా కొరత వేధిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా బస్తాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మరోవైపు కొరత సాకుతో మార్క్‌ఫెడ్ అధికారులు సహకార సంఘాలకు సరఫరా చేస్తున్న యూరియా కోటాలో కోత పెడుతున్నట్లు తెలిసింది. దీంతో రైతులకు సరిపడా ఎరువులు అందడం లేదని రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల కిందట కరీంనగర్ మండలానికి మొత్తం వంద టన్నుల యూరియాను సరఫరా చేశారు. దుర్శేడ్ సొసైటీకి 40 టన్నులు, చెర్లబూత్కూర్ విక్రయ కేంద్రానికి 20, బొమ్మకల్‌కు 20, నగునూర్‌లోని ఆగ్రోస్ కేంద్రానికి 10, తీగలగుట్టపల్లి డీసీఎంఎస్‌కు 10 టన్నుల చొప్పున పంపిణీ చేశారు. ఆయా వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతులకు నాలుగు బస్తాల చొప్పున అందజేశారు. ఇప్పటివరకు ఆయా కేంద్రాలకు యూరియా రాక పోవడంతో రైతన్నలు పడిగాపులుకాస్తున్నారు. యూరియా బస్తాలు లోడ్ అవుతున్నాయని.. వస్తున్నాయని అధికారులు చెబుతున్నా సరిపడా సరఫరా చేయడంలో విఫలమవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించాలని, సరిపడా యూరియా, ఎరువులను అందించాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 19 : (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సాధ్యమని, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ అన్నారు. కరీంనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో కులగణన కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిందన్నారు. తెలంగాణలో సామాజిక స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తోందన్నారు. నిరుద్యోగులు, మేధావులు, పట్టభద్రులు, ప్రజాస్వామ్య వాదులు కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట శ్రీకృష్ణ, అజీజ్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్

తాగు, సాగు నీటికి ఇబ్బందులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తాగు, సాగు నీటికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, సమస్యను పరిష్కరించాలని మండలంలోని మొగ్దుంపూర్, నల్లగుంటపల్లి, ఇరుకుల్ల, మందులపల్లి గ్రామాలకు చెందిన రైతులు కోరారు. బుధవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి సమస్యను విన్నవించారు. తమ గ్రామాల పరిధిలో ఉన్న గుండి వాగు ఎండిపోయిందని, సాగు, తాగు నీరు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీరు లేక సుమారు 50 ఎకరాలు ఎండిపోయాయని తెలిపారు. వారం రోజుల్లోగా నీరు అందకపోతే గ్రామ పరిధిలోని పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ మత్తడి నుంచి గుండివాగు ద్వారా నీరు ఇప్పించాలని కోరారు.

రేకుర్తి కంటి ఆస్పత్రిలో రికార్డు స్థాయిలో ఆపరేషన్లు

భగత్‌నగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్‌మాడేకర్ నేత్ర వైద్యశాలలో బుధవారం రికార్డు స్థాయిలో 109 మందికి కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి మాట్లాడుతూ రేకుర్తి కంటి ఆసుపత్రిలో వారంలో రెండు రోజులు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఒకరనోజు వాకిన్ ఫ్రీ ఆపరేషన్లు చేస్తుండగా ఒకరోజు ఒక రెఫరల్ పేషంట్‌కు శస్త్ర చికిత్స చేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా వారంలో నాలుగు రోజులు గ్రామాల్లో పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు.

హామీలు నెరవేర్చాలని సీఎంకు పోస్టుకార్డులు

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హామీలు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో పోస్ట్ బాక్స్ వద్ద సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డులు పంపారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇస్తానన్న 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు, పెన్షన్ రూ. 25,000, గుర్తింపు కార్డులు, బస్, రైల్వేపాసులు వంటి హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమలో కరీంనగర్ టౌన్ మహిళా అధ్యక్షురాలు కారుపకాల మున్నా, పట్టణ అధ్యక్షులు గోడిశాల రమేష్, అకుష్, శంకర్ మొగిలి అంజలి ఆసిన, గౌరి, రాజేశ్వరి, విజయ, మల్లేశం విజయభాస్కర్, గాలి రమేష్, గరిగే కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టు కార్డులు చూపిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

రాజకీయ పరిపక్వత లేకుండా మాట్లాడడం సిగ్గు చేటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్, బీజేపీ నాయకుడు సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌పై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి రాజకీయ పరిపక్వత లేకుండా మాట్లాడడం సిగ్గు చేటని బీజేపీ నాయకుడు, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు మండిపడ్డారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బండి సంజయ్‌ని విమర్శించే ముందు నరేందర్‌రెడ్డి స్థాయి ఏమిటో ఆలోచించుకోవాలన్నారు. రాజకీయ నేపథ్యం లేకుండానే అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా, రెండుసార్లు కార్పొరేటర్‌గా, ఎంపీగా గెలిచి కేంద్రహోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్న బండి సంజయ్‌కుమార్ ప్రజల మనిషిగా వారి హృదయాల్లో నిలిచారన్నారు. కార్పొరేటర్‌గా కూడా గెలవని నరేందర్‌రెడ్డి కేంద్ర మంత్రిని విమర్శించడం శోచనీయమన్నారు. బండి సంజయ్‌కుమార్ మాట్లాడే ప్రతీ మాట సగటు ప్రజల అభీష్టాన్ని తెలుపుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల్లో జిల్లాలో ఏం అభివృద్ధి చేసిందో స్పష్టత ఇవ్వాలన్నారు. కరీంనగర్ నియోజకవర్గం, జిల్లా అభివృద్ధికి బండి సంజయ్‌కుమార్ పాటుపడుతున్నారన్నారు. కరీంనగర్‌కు కేంద్రం స్మార్ట్‌సిటీ ఇవ్వకుంటే ఎలా ఉండేదో ఒక్కసారి ఆలోచించాలన్నారు. ప్రజా సంఘాల యాత్ర పేరుతో బండి సంజయ్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించడం దుర్మార్గమన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ యాత్ర చేయడం గొప్పవిషయమన్నారు. ప్రజా సమస్యల కోసం జైలుకు వెళ్లిన చరిత్ర సంజయ్‌దన్నారు. నరేంద్రమోదీ బీసీ కాదని మాట్లాడింది ఎవరని, వాటిపై ఆలోచన లేకుండా బండి సంజయ్‌పై ఆరోపణ చేయడం సరికాదని అన్నారు. నమ్మిన ధర్మం, సిద్ధాంతం కోసం తప్పకుండా బండి సంజయ్ మాట్లాడుతారని స్పష్టం చేశారు. బీజేపీ నాయకులు లెక్కల వేణు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వం తీసుకున్న పోపా అధ్యక్షుడు



సభ్యత్వం స్వీకరిస్తున్న పోలు సత్యనారాయణ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ బుధవారం బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ బీజేపీ సభ్యత్వ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేయాలని సూచించారు. పోపా ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ అధికారులు తనపై కుట్రలు చేస్తున్నారని, కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మాజీ మేయర్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. బుధవారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నామినేషన్ వేసే సమయంలో తన వాహనాలను అడ్డగించి, మంత్రుల వాహనాలను లోనికి అనుమతించిన వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. బ్యాలెట్‌లో ముందుండాలని నరేందర్‌రెడ్డి పేరును అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిగా మార్పు చేశారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు బహిర్గతం చేస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద ఉన్న ఓటరు వివరాలు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి వెబ్‌సైట్‌లో ఎలా పొందుపరిచారని ప్రశ్నించారు. అధికారుల ప్రమేయంతో ఓటర్ల జాబితా లీక్ అయ్యిందని, ఇలాంటి అక్రమాలకు పాల్పడితే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు న్యాయవాదులు దేవకిషన్, మురళి, నాగరాజు, శరత్‌చందర్‌రావు, వినయ్, రాజ్‌కుమార్, సందీప్, రమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీవీ రామన్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ఆంజనేయులు

కరీంనగర్‌టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వ శాంతి పాఠశాలకు చెందిన విద్యార్థులు సీవీ రామన్ యంగ్ జీనియస్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రజిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ఆంజనేయులు బుధవారం తెలిపారు. డిసెంబరు 28న నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పాఠశాలకు చెందిన సాన్విక వంగ, ఆరోతరగతి రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంకు, జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు, నిర్విజ్ఞ పిట్టల రెండో ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ఈనెల 16న హైదరాబాద్ లలిత కళా తోరణంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీనటుడు రావురమేష్, సుచర్ ఇండియా చైర్మన్ కిరణ్‌రావు అవార్డులు ప్రదానం చేసినట్లు చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బలపర్చండి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బలపర్చాలని, పార్టీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజొద్దీన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం కరీంనగర్‌లోని వాణినికేతన్ పాఠశాల, కేకే స్కూల్, గాయత్రీ బ్యాంక్, పలు ఆస్పత్రుల్లో పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు.

గణేశ్‌నగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మద్దతు తెలుపు తున్నట్లు ఆల్ బీసీ మైనారిటీ వెల్ఫేర్ ఆర్గనైజషన్ రాష్ట్ర అధ్యక్షుడు షుక్రుద్దీన్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర సలహాదారు సయ్యద్ మౌలానా హుస్సేన్, రాష్ట్ర ఉపాధ్య క్షుడు మహబూబ్ అలీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి: ఎమ్మెల్యే



మానకొండూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే ఎమ్మెల్సీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయానికి ప్రతి కార్యకర్త నడుంబిగించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్‌గౌడ్, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

గన్నేరువరం: మండలంలోని గునుకుల కొండాపూర్‌కు చెందిన సుదగోని కిష్టస్వామిగౌడ్ మంగళవారం హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. మృతికిగల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

తిమ్మాపూర్: జర్నలిస్టులసంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్ఎండీ కాలనీలో గలక్యాంపు కార్యాలయంలో మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు తెలంగాణవర్కింగ్‌జర్నలిస్టు యూనియన్- టీజేయూ2025సంవత్సర డైరీని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు అందజేశారు.

ఆస్తి, నల్లా బిల్లులు వందశాతం వసూలు చేయాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, నల్లా, ట్రేడ్‌లైసెన్స్, షాపుల కిరాయిలను వందశాతం వసూలు చేయాలని మున్సిపల్‌సిబ్బందికి మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపుకలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. బుధవారం మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురపాలక సంఘానికి బాకీఉన్న డబ్బులను ఇంటింటికి తిరిగి వసూళు చేయాలన్నారు. మార్చి 31లోగా వంద శాతం పన్నులు వసూళ్లు చేయాలన్నారు. అనంతరం జమ్మికుంట రోడ్‌లోని పంటకాలువ, మురికికాలువలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్‌కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ కనకయ్య, మేనేజర్ భూపాల్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్‌అధికారి అశ్వినిగాంధీ, సీనియర్ సహాయకులు రషీద్, శ్రీకాంత్, సుధీర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **ప్లాస్టిక్ వాడకం నివారించాలి..**

హుజూరాబాద్‌లో ప్లాస్టిక్ వాడకం నివారించాలని కోరుతూ ఆర్టీసీ రిటైర్డ్‌మెంట్ ఉద్యోగులు, పర్యావరణ పరిరక్షణకమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ప్రత్యేకాధికారి ప్రఫుల్ దేశాయ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రవీందర్, ప్రభాకర్, నర్సయ్య, సంజీవ్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

● **పన్నుల వసూళ్లలో మొదటిస్థానం కొనసాగించాలి**

జమ్మికుంట: పన్నులవసూళ్లలో మొదటిస్థానాన్ని అలాగే కొనసాగించాలని అదనపుకలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి ప్రఫుల్‌దేశాయ్‌అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహమ్మద్‌ఆయాజ్, ఇతరఅధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో జమ్మికుంట మున్సిపాల్టీ మొదటిస్థానంలో నిలకడగా ఉంచుతూ ముందుకుసాగడం సంతోషంగా ఉందన్నారు. జమ్మికుంట-హుజూరాబాద్‌రోడ్డు సర్వాంగసుందరంగా పూల మొక్కలు నాటాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ డిగ్రీకళాశాల, జూనియర్‌కళాశాల పాతభవనాలు వృథాగాఉన్నాయని అధికారులు తెలుపగా వాటిని సందర్శించారు. కార్యక్రమంలో మేనేజర్‌రాజిరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, వార్డుఆఫీసర్లు,బిల్‌కలెక్టర్లు,సిబ్బంది పాల్గొన్నారు.



జమ్మికుంట సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్, కమిషనర్ మహమ్మద్ ఆయాజ్

తడిపొడి పద్ధతిలో చీడపీడలు రావు

గంగాధర, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిపంటను తడి, పొడి పద్ధతిలో సాగుచేస్తే చీడపీడలు సోకకుండా ఉంటాయని జమ్మికుంట కృషివిజ్ఞానకేంద్రం సీనియర్‌శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపూర్‌లో జమ్మికుంట కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలబృందం వరిపొలాలను పరిశీలించింది. ఈ సందర్భంగా వరిలో మొగిపురుగు తెగుళ్లు, జింక్‌లోపం ఉన్నట్లు గుర్తించారు. రైతులు వ్యవసాధికారుల సూచనలమేరకు ఎరువులను వాడాలన్నారు.

పంటసాగు డిజిటల్ సర్వే పరిశీలన

శంకరపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నంలో డిజిటల్‌క్రాప్‌సర్వేను జిల్లావ్యవసాయాధికారిని భాగ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 75 శాతం సర్వే పూర్తయిందన్నారు. సర్వేను త్వరలో పూర్తి చేస్తామన్నారు.

పురుగు మందుల వాడకంపై రైతులకు అవగాహన

సైదాపూర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్‌లోని రైతువేదికలో ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ ట్రాక్టర్ బ్రాండ్ కంపెనీ ఆధ్వర్యంలో పురుగుమందుల వాడకంపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. కంపెనీజోనల్ మేనేజర్ రవీందర్‌రావు, సెల్స్‌ఎగ్జిక్యూటివ్ రవీందర్‌రెడ్డి రైతులు పురుగు మందుల వాడకంలో రక్షణ కల్పించే వస్త్రాలను ధరించాలన్నారు. పిచికారి చేసేటప్పుడు పొగతాగడం, గుట్కానమలడం చేయకూడదన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామడుగు, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కరీంనగర్ సీనియర్‌సివిల్‌జడ్జి జిల్లా న్యాయసేవాధికారి కెవెంకటేష్ అన్నారు. మండలంలోని వెలిచాలలో జడ్పీఉన్నతపాఠశాలలో బుధవారం న్యాయవిజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ చట్టాలపట్ల అవగాహన అవసరమన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రత్యేకమొబైల్ కోర్టుజడ్జి శ్రీమతి సరళ వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థినులకు సైన్స్ టాలెంట్ టెస్టు

హుజూరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణం కేసీ క్యాంపులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీబాలికల గురుకుల పాఠశాలలో బుధవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి డిక్షనరీలు అందజేశారు.

న్యూట్రీషన్ గార్డెన్ సందర్శన

ఇల్లందకుంట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీఉన్నత పాఠశాలలోని న్యూట్రిషన్‌గార్డెన్‌ను ఎంపీడీవో పుల్లయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గార్డెన్‌సంరక్షణ బాధ్యత సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

కరీంనగర్‌రూరల్/గణేశ్‌నగర్ ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గణేశ్‌నగర్, కరీంనగర్ మండలం నగునూరులో బీజేపీ, ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో మండలశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్, ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ అధ్యక్షుడు చిట్యాల రాజు, నాయకులు శివ, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హుజూరాబాద్/గంగాధర/ఇల్లందకుంట/వీణవంక/మానకొండూర్/రామడుగు/జమ్మికుంట రూరల్/చొప్పదండి: మండలకేంద్రాలతోపాటు, గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బీజేపీ,వీహెచ్‌పీ, ఆరెకులస్తుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గంగాధర మండలం గట్టుబూత్కూర్‌లో మాజీసర్పంచ్ విజేందర్ రెడ్డి, మాజీవైస్‌ఎంపీపీ రాజ్‌గోపాల్ రెడ్డి, మధురానగర్‌లో మాజీఎంపీపీ మధుకర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందూ ధర్మం కోసం శివాజీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జమ్మికుంట మండలం పాపయ్యపల్లిలో శివాజీ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలలు వేశారు.



గంగాధర: గట్టుబూత్కూర్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

32 పేజీల శుభలేక

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటకు చెందిన సుద్దాల రవళిక పెళ్లి పత్రికను తల్లిదండ్రులు శ్రీనివాస్-శ్రీదేవి సంప్రాదాయ పద్ధతిలో అచ్చువేయించడం అందరిదృష్టిని ఆకర్షిస్తోంది. వివాహ విశిష్టతను తెలియజేస్తూ పెళ్లికార్డును 32 పేజీల పుస్తకంగా తయారు చేయడం విశేషం. తలంబ్రాలు, బ్రహ్మముడి, కాళ్లు తొక్కించడం, ఉంగరాలు తీయడం, జీలకర్ర-బెల్లం ప్రాముఖ్యత, మాంగళ్య పూజ విశిష్టతను పుస్తకంలో క్లుప్తంగా వివరించారు.



శుభలేక లోపలి పేజీలు

రూ.6,950 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.6950పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 6950క్వింటాళ్లు, ఐదుగురు రైతులు పదిక్వింటాళ్ల పత్తివిక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగవేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6950, కనిష్ఠ ధర రూ.5500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

హుజూరాబాద్ వాసికి రాష్ట్రస్థాయి అవార్డు

హుజూరాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన దివిటి అంజనీదేవికి అస్తిత్వం సేవా సంస్థ తెలంగాణ ప్రభుత్వభాషాసంస్కృతిక శాఖ సౌజన్యంతో రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ఈనెల21న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అంజనీదేవికి ఈఅవార్డు ప్రదానం చేయనున్నారు.

టాలెంట్ ఈవెంట్‌ను విజయవంతం చేయండి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీ చైతన్య ఇంజనీరింగ్‌కాలేజీలో తెలంగాణటాస్క్ వారు నిర్వహిస్తున్న క్రియేటివ్‌కార్నివాల్ టాలెంట్ హంట్ ఈవెంట్‌ను విజయవంతం చేయాలని విద్యాసంస్థలచైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మార్చి1న నిర్వహించనున్న ఈ ఈవెంట్‌కి ఉమ్మడిజిల్లా నుంచి 40కళాశాలలు, ఇంజనీరింగ్, డిగ్రీ,ఫార్మసీ, జూనియర్ కళాశాలలు పాల్గొననున్నట్లు తెలిపారు.

కెనాల్‌లో పడి సింగరేణి రిటైర్డు కార్మికుడి మృతి

మంథని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోచమ్మవాడ సమీపంలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి సింగరేణి రిటైర్డు కార్మికుడు తిప్పనిశంకరయ్య(80) మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కాలనీకి చెందిన శంకరయ్య ఈనెల18న స్వగ్రామమైన ఓదెలకు వెళుతున్నట్లు భార్య మల్లమ్మకు చెప్పి బయలుదేరాడు. ఓదెలకు చేరుకోకపోవడం, ఫోన్ పనిచేయకపోవడంతో ఈనెల18న శంకరయ్య కొడుకు తిప్పనిలక్ష్మణ్ నస్పూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు100కు డయల్ చేశారన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహానికి పరిశీలించారన్నారు. శ్రీరాంపూర్‌లో మిస్సింగ్ కేసు నమోదు కాగా శంకరయ్య బంధువులను మంథనికి పిలిపించగా మృతదేహాన్ని పరిశీలించి శంకరయ్యగా గుర్తించారన్నారని ఎస్ఐ రమేష్ తెలిపారు. శంకరయ్య మద్యం సేవించి మతి స్థిమితం లేకుండా తిరుగుతూని, ఈ నేపథ్యంలో ఓదెలలోని దర్గారం గ్రామంలో బంధువులు ఉండటంతో అక్కడి వచ్చి మద్యం సేవించి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడి కొడుకు లక్ష్మణ్ ఫిర్యాదు చేయగా ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

వీణవంక, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల వీరమ్మ(91) చలిమంట కాగుతూ చీరకు మంటలంటుకోగా చికిత్సపొందూ మృతిచెందింది. పోలీసులు వివరాల ప్రకారం.. ఈనెల12వతేదీన ఉదయం ఇంటిముందు చలి మంటకాగుతుండగా ప్రమాదవశాత్తు వీరమ్మ చీరకు నిప్పంటుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

అతిగా మద్యం తాగి యువకుడు..

ధర్మపురి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామానికి చెందిన బందారి భూమేష్(32) అనే యువకుడు అతిగా మద్యంసేవించి మృతిచెందినట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. బందారి లక్ష్మి అనే మహిళకు కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉండగా కొడుకు భూమేష్ అతిగా మద్యం సేవిస్తుంటాడని తెలిపారు. లక్ష్మి వీరిపూర్ జాతరకు వెళ్లి బుధవారం వచ్చి చూసే సరికి కొడుకు భూమేష్ మంచంపై చనిపోయి ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. భూమేష్ అతిగా మద్యం సేవించి తిండి సరిగా తినక పోవడం వల్ల మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉరివేసుకుని మాజీ జడ్పీటీసీ ఆత్మహత్య



రాజమల్లు (ఫైల్)

వీణవంక, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ ఆనంద రాజమల్లు(72) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాజమల్లు కొంతకాలంగా ఆర్థికఇబ్బందులతో బాధపడుతున్నాడు. బుధవారం ఎవరులేని సమయంలో ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. 1997లో టీడీపీ తరఫున జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా కొనసాగారు.

ఉరివేసుకుని యువకుడు..

ఎలిగేడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామానికిచెందిన యాదగిరి చందు(27)అనే యువకుడు బుధవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంటెక్ వరకు చదువుకున్న చందు ఏమి పని చేయకుండ ఇంటివద్దనే ఉంటున్నాడు. ఏదైన పని చూసుకొమ్మని తరచూగా తల్లిదండ్రులు చెప్పేవారు. ఈక్రమంలో ఫోన్‌లో పరిచయమైన అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకుంటావని మందలించారు. ఆటు ఉద్యోగంలేక ఇటు అమ్మాయిని పెళ్లి చేసుకోలేక ఖాళీగా ఉంటున్నాననే మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బాలిక (మానసిక వికలాంగురాలు)పై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయలు జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి నీలిమ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మల్యాల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓబాలికపై 2021సంవత్సరంలో చెర్లపల్లి నారాయణ అలియాస్ టోపి నారాయణ(55) అనేవ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్యాల పోలీసులు నారాయణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో కేసు విచారణ చేపట్టగా కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్షులను ప్రవేశపెట్టగా స్పెషల్ కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణా రావుతో పాటు పోలీస్, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

భార్య, ఇద్దరు పిల్లల మృతికి కారణమైన భర్త రిమాండ్

పెగడపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భార్య, ఇద్దరు పిల్లల మృతికి కారణమైన మద్దులపల్లి గ్రామానికిచెందిన కంబాల తిరుపతిని బుధవారం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన కంబాల తిరుపతి వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తన భార్య హారికను వేధింపులకు గురి చేశాడు. దీంతో హారిక పిల్లలకు పురుగుల మందు ఇచ్చి ఆమె కూడా తాగి మృతి చెందింది. ముగ్గురి మృతికి కారణమైన తిరుపతిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సీహెచ్ రవికిరణ్ తెలిపారు.

సెల్‌ఫోన్ హ్యాక్‌పై సైబర్‌క్రైంకు ఫిర్యాదు

మంథని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విస్సంపేట గ్రామానికి చెందిన పెట్టవేన హరీష్ సెల్‌ఫోన్ హ్యాక్ కాగా మంథని పోలీసులతో పాటు సైబర్ క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. మండలానికి ఆర్జిత ఆన్‌ఏపీకే ఫైల్‌తో వాట్సాప్ ఓపెన్ చేయడంతో చాలా మందికి అతని వాట్సాప్ ద్వారా అశ్లీల చిత్రాలు వెళ్లాయి. వారు ఫోన్‌చేసి తమకుచెప్పగా వెంటనే తన ఫోన్ హ్యాక్ అయినట్లు అందోళనకు గురై పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వారి సూచనమేరకు సైబర్ క్రైం 1930 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేసి తన సిమ్ బ్లాక్ చేసినట్లు తెలిపారు.

దొంగలు పట్టివేత

ధర్మపురి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చిల్లర సామాన్లు దొంగతనం చేసిన ఐదురుగు మహిళలను స్థానికులు బుధవారం పట్టుకున్నారు. రొయ్యపల్లి మండలానికి చెందిన ఐదురుగు మహిళలు గ్రామంలో చెత్త సామాన్లు, కాగితాలు సేకరించి బయట విక్రయిస్తుంటారు. అదే సమయంలో తిమ్మాపూర్ గ్రామంలోని పలు ఇళ్లలో దొంగిలించి ప్లేట్, ఇత్తడి బిందెలు, ప్లేట్స్, బెండులు, గ్లాసులు దొంగిలించారు. వెంటనే గ్రామస్తులు సదరు మహిళలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

ఆల్‌రౌండర్ అనిల్



పాట పాడుతున్న అనిల్ పల్ల

సింగర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, రైటర్‌గా రాణిస్తున్న కథలాపూర్ యువకుడు

పదేళ్లుగా యూట్యూబ్‌లో సందడి

60 వేల మంది సబ్‌స్క్రైబర్లు

కథలాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పరుచుకున్న అందాలు.. గ్రామీణ యువత మనసులోని మధురానుభూతులు..ఆధ్యాత్మిక భావాలను సొంపొందించి పదాలే ఆ యువకుడి కథా వస్తువులు. కథలాపూర్ మండలం దూలూరుకు చెందిన అనిల్ పల్ల అనే యువకుడు సింగర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, రైటర్‌గా రాణిస్తున్నాడు. పదేళ్లుగా ఆడిన పాటలు యూట్యూబ్‌లో సందడి



అనిల్ నటించి, దర్శకత్వం వహిస్తున్న ఆల్బం

చేస్తున్నాయి. సమ్మక్క- సారలమ్మ, బతుకమ్మ పండగ ప్రాశస్త్యాన్ని పాటలుగా రాయడమే కాకుండా కెమెరాలో బంధించి 60 వేల మంది సబ్‌స్క్రైబర్లను సంపాదించాడు.

సీఎస్ క్రియేషన్స్ ఫిల్మ్ ప్రొడక్షన్ ఏర్పాటు

2015లో సీఎస్ క్రియేషన్స్ ఫిల్మ్ ప్రొడక్షన్ సంస్థను స్థాపించిన అనిల్ సొంతంగా పాట రాసి స్వీయ దర్శకత్వంలో వీడియో చిత్రీకరించి రైతు పాట పేరిట మొదటిసారిగా యూట్యూబ్ లో అప్‌లోడ్ చేశాడు. దీంతో అనేక మంది ఆ పాటను ఆదరించారు. సుద్ద నక్కల పిలగా, మనసులో తెరచూటుగా, నినదిన నింతల్లారా, బతుకమ్మ, సమ్మక్క, సారలక్క, వానల్లో వరదల్లో చినుకుల్లో వంటి జానపద పాటలను నటీనటులతో కలిసి వీడియోలు రూపొందించాడు. పల్లెటూరు యువతలో దాగి ఉన్న కళను బయటకు తీసే ప్రయత్నం చేశాడు.

భజరంగ్ మూవీ మేకర్స్‌తో సినిమాలు

వీడియో పాటలకు వెల్లువలా వస్తున్న కామెంట్లతో తన ప్రతిభకు మరింత పదును పెట్టాలనే యోచనతో భజరంగ్ మూవీ మేకర్స్ పేరిట సినిమాలు తీయాలని సంకల్పించాడు. ఆరాచకం, మరిది పోతున్న కన్నయ్యా అనే సినిమాలు పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉన్నాయి.

బాల్యం నుంచి పాటలంటే ఇష్టం

అనిల్ పల్ల, కళాకారుడు

పల్లె ప్రజల జీవన శైలి నేపథ్యంతోనే పాటలు రాయాలని చిన్ననాటి నుంచి ఆసక్తి ఉండేది. భీమారం మండలం ఈదుల లింగంపేట పాఠశాలలో చదువుకునే రోజుల్లో నేను పాడిన పాట విని గురువులు అభినందించారు. జిల్లాస్థాయి పాటల పోటీల్లో గెలుపొంది వేములవాడలోని సినారె కళాభవన్‌లో సినారె చేతుల మీదుగా బహుమతి పొందడం నాలో మరింత ఆసక్తిని పెంచింది. ప్రస్తుతం కథలాపూర్‌లో స్టూడియో ఏర్పాటు చేసుకొని పాటలు రాస్తూ, గానం చేస్తూ, దర్శకత్వం, డబ్బింగ్, కాస్ట్యూమ్, ఎడిటింగ్ వంటి పనులన్నీ చేసుకుంటున్నా. యూట్యూబ్‌లో 60 వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉండడం చాలా సంతోషంగా ఉంది.

మైసమ్మ ఆలయంలో చోరీ..

ముస్తాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) :ముస్తాబాద్ మండలకేంద్రంలోని పత్తి శేరుకుంట కట్టపైగల మైసమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి జరిగిందని ఆలయ కమిటీచైర్మన్ బద్దిపడిగె ప్రతాపరెడ్డి తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన రూ.12 వేలువిలువచేసే గంటతో పాటు హుండీలోని డబ్బులను దొంగలు దొంగిలించారన్నారు. గతంలో సైతం ఇలాగే చోరీ జరిగిందని వాపోయారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ప్రతాపరెడ్డి, పుల్లూరి రవిలు వివరించారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

ఓదెల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు హరిపురం రోడ్డు పైన బుధవారం పోలీసులు పేకాటకేంద్రంపై దాడిచేశారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ ఓదెలకు చెందిన కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లిదాడి చేశామని తెలిపారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.రూ.7,100, మూడు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పేకాటలు, కోడిపందేలు, బెట్టింగులు లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కానిస్టేబుళ్లు రాజేందర్, ప్రశాంత్, రామకృష్ణ పాల్గొన్నారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● 103 గ్రాములు బంగారం స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగ మిట్టపల్లి లక్ష్మణ్ అలియాస్ రవి అలియాస్ విజయ్‌ని మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ వద్ద అరెస్ట్‌చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ కొద్ది సంవత్సరాలుగా ఉమ్మడికరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో తాళం వేసిన ఇళ్లను గుర్తించి బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించేవాడని అన్నారు. నిందితుడిపై 40కేసులు ఉండగా 28కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 12 కేసులలో జైలు శిక్ష విధించిందని పేర్కొన్నారు. గత ఏడాది బెయిల్ మీద వచ్చి మల్లాపూర్ మండలం ముత్యంపేట, సిర్పూర్, మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామలలో చోరీ పాల్పడ్డాడని తెలిపారు. మంగళవారం సాయంత్రం మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామ శివారులోని చక్కెర ఫ్యాక్టరీ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా లక్ష్మణ్ అను మానస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. దీంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు నేరం ఒప్పుకోవడంతో అతని వద్ద నుంచి 103 గ్రాములు బంగారం, 125 గ్రాముల వెండి, ఒక బైక్‌స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని, మల్లాపూర్ ఎస్ఐ రాజులు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రాములు అభినందించారు.

వృత్తి కూలి పని.. ప్రవృత్తి గంజాయి సాగు

● సిరిసిల్ల మెడికల్ కళాశాల నిర్మాణ ప్రదేశంలో గంజాయి మొక్కల పెంపకం

● ఒడిశా, పశ్చిమ బెంగాల్ వలస కూలీల గుట్టురట్టు చేసిన పోలీసులు

● జిల్లా వ్యాప్తంగా ఏడాదిలో 2.2 కిలోల గంజాయి సీజ్.. 48 మంది అరెస్ట్



● గంజాయి రవాణాపై ఉక్కుపాదం - అఖిల్ మహజన్, ఎస్పీ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు వలస వచ్చిన ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు పనిచేసే ప్రదేశంలోనే గంజాయి సాగు చేశారు. వారిని వారంరోజుల క్రితం పోలీసులు పట్టుకున్నారు. జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేశారు. నార్కోటిక్ జాగిలాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఏడాదిలో గంజాయి అక్రమ రవాణా, సాగుచేస్తున్న, తాగుతున్న 48మందిని అరెస్ట్ చేశారు. వారినుంచి 2.2కిలోల గ్రాముల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు.

● గంజాయి సాగులో కొత్తకోణం..

గంజాయి సాగులో కొత్త కోణం వెలుగు చూసింది. తమపై ఎవరి దృష్టిపడదని భావించిన వలస కూలీలు సిరిసిల్ల మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు చేస్తూ అక్కడే గంజాయి మొక్కల పెంపకం చేపట్టారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల పోలీసులు ఈ వ్యవహారాన్ని గుట్టురట్టు చేశారు. సిరిసిల్ల పట్టణం బైపాస్ రోడ్డులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు జరుగు తున్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన దేబ్రట్ దాలి, మాలే మాలిక్ సెంట్రింగ్ పని చేసే కుంటా పక్కనే పెద్దలో ఉంటున్నారు. పక్కనే ఉన్న భూమిలో గంజాయి విత్తనాలు చల్లి మొక్కలు పెంపకం చేపట్టారు. పెరిగిన ఆకులను తెంపి ఎండబెట్టి గంజాయిని తయారుచేస్తున్నారు.

● ఆరుగురు కటకటాలపాలు

గంజాయి సాగుచేస్తూ, సేవిస్తున్న ఆరుగురు వలస కూలీలను కటకటాలపాలయ్యారు. ఒడిశాకు చెందిన దేబ్రట్ దాలి, మాలే మాలిక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రణబ్ సింఘా, సాగర్ సర్కార్, జిబాన్ బిశ్వాస్, రంజిత్ సింఘాను పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 5.2 లక్షల రూపాయల విలువైన 52గంజాయి మొక్కలను తొలగించి ధ్వంసం చేశారు. ఆరుగురు వలసకూలీలను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపి 50గ్రాముల ఎండిన గంజాయి, రెండు గంజాయి తాగే పైపులను పోలీసులు సీజ్ చేశారు. ఈ విషయం సిరిసిల్లలో చర్చనీయాంశమైంది.



వలసకూలీలు సాగు చేసిన గంజాయి మొక్కలు(ఫైల్)

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాం. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తూ నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేస్తూ గంజాయి అక్రమ రవాణాను అరికడుతున్నాం. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై నిఘా పెట్టి గంజాయి కట్టడి నమోదుతో యారిన్ టెస్ట్‌లు నిర్వహించి సేవించే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. గంజాయికి అలవాటు పడిన వారికి డీఅడిక్షన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. గంజాయి విక్రయించినా, సాగు చేసినా, రవాణా చేసినట్లు తెలిస్తే వెంటనే 8712656392 నంబర్‌కు సమాచారం అందిస్తే కఠినచర్యలు తీసుకుంటాం.

దాడికి పాల్పడిన భార్యాభర్తలపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటిపక్కన గోడ విషయంలో దాడికిదిగి గాయపరిచిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు బీమిరి రేణ, నర్సింలుపై కేసు నమోదుచేశామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామంలోని బీమిరి అంజయ్య తన ఇంటిస్థలంలో పక్కనే ఉన్న సోదరుడు నర్సింలు ఇల్లు కనిపించకుండా గోడను నిర్మించాడు. అడ్డుగా ఉన్న గోడను నర్సింలు తొలగించడంతో ఈనెల 18న ఇద్దరిని గాయపరిచాడు. దాంతో కోపోద్రిక్తుడైన నర్సింలు తన ఇంటిలోని కొడవలిని తీసుకొని వచ్చి అంజయ్యపై దాడికి దిగాడు. అడ్డుగా వెళ్లిన అంజయ్య భార్య మనెవ్వ, కొడుకు అభిలాష్‌లను రోకలిబండతో దాడిచేశాడు. ఈ క్రమంలో నర్సింలు, అతని భార్య రేణ అసభ్యపదజాలంతో దూషిస్తూ విచక్షణారహితంగా చితకబాదారు. బాధితుడు అభిలాష్ ఫిర్యాదు మేరకు భార్యాభర్తలు రేణ, నర్సింలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

అసత్య ప్రచారం చేసిన యువకుడిపై..

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అధికారులపై అసత్య ప్రచారంచేసిన కందికట్కూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి శశిధర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, పోలీసు అధికారులతో పరిచయాలు ఉన్నాయంటూ ప్రచారం చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఎవరు తప్పుడు ప్రచారం చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులను కించపరిచే పోస్టులు పెట్టిన ఇద్దరిపై..

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులను కించపరిచే విధంగా సోషల్‌మీడియా వేదికగా పోస్టులు చేసిన గుండ్రపు గణేశ్, ఆకుల శ్రీనివాస్‌రెడ్డిలపై బుధవారం కేసులు నమోదు చేశామని సిరిసిల్ల టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. వీరితో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా అధికారుల గురించి, వారి వ్యక్తిగత విషయాలను సంబంధించిన అసభ్యకర పోస్టులు పెడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు, ఉద్యోగులను కించపరిచే విధంగా, మహిళాలను దెబ్బతీసే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసిన వారిపై, గ్రూప్ అడ్మిన్‌లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు దగ్ధం

మల్లాపూర్, ఫిబ్రవరి, 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టాపూర్‌గ్రామంలోని ఓ మెకానిక్ షెడ్‌లో రెండు బైక్‌లు, పలుసైకిళ్లు దగ్ధమైనట్లు బుధవారం గ్రామ స్థులు తెలిపారు. వారికథనం ప్రకారం గ్రామంలోని మెకానిక్‌షెడ్ వద్ద మరమ్మతుల నిమిత్తం ఉన్న వాహనాలు, సైకిళ్లు కాలిపోయాయన్నారు. ఏప్రమాదం జరిగిందా లేకపోతేనా చెలా అనే అనుమానాలు వ్యక్తం చేశారు.

12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్, ఫిబ్రవరి 19(ఫిబ్రవరి):మండలంలోని మొర్రాయిపల్లెశివారులో 12 క్వింటాళ్లరేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన ఆవరాశి శేఖర్, గంధ సత్యనారాయణ గ్రామాలలో తిరుగుతూ సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని అధికధరకు దొడ్డు ప్రవీణ్‌కు అమ్మడానికి నిర్ణయించారన్నారు. మొర్రాయిపల్లె శివారులో నిల్వఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ద్విచక్రవాహనంపై తరలిస్తుండగాపట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం స్వాధీనంచేసు కొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

శంకరపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయరహదారిపై బుధవారం రాత్రి లారీ, బైక్ ఢీకొన్నఘటనలో ఓయువకుడు దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన ముద్దమల్ల హరీష్(23) లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కొత్తపల్లి రవి సంఘటన స్థలానికి చేరుకొని మృతికి సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

గొల్లపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట సమీపంలోని సర్వే నెం.544లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వడంతో కాకుండా, అడ్డుకోవడానికి వచ్చిన రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కల్పించిన ఒడ్డె రవి అనే వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

లింగంపేటలో 2500 కోళ్లు మృతి

● ఆలస్యంగా వెలుగులోకి



ట్రాక్టర్‌లో మృతి చెందిన కోళ్లు(ఫైల్)

చందుర్తి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపేటలో అంతుచిక్కని వ్యాధితో 2500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. వారం రోజుల క్రితం ఈ సంఘటన జరగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలో రమేష్‌రావుకు చెందిన పౌల్ట్రీఫామ్‌లో వారంక్రితం మూడు రోజుల్లో 2500 కోళ్లు మృత్యువాతపడ్డాయి. దీంతో వాటిని ట్రాక్టర్‌లో గ్రామానికి దూరంగా తీసుకెళ్లి గోతి తీసి పూడ్చివేశారని, కోళ్ల మృతితో నాలుగు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు రమేష్‌రావు వాపోయాడు. కాగా, గురువారం గ్రామాన్ని సందర్శించి శాంపిల్స్ సేకరించనున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి శ్రీధర్ తెలిపారు.

క్రీడారంగంలో నంబర్‌వన్‌గా నిలుపుతాం

● తెలంగాణ ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న పి మల్లారెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడలను ప్రమోట్ చేసేందుకు ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఏటా స్పోర్ట్స్ ఒలింపియాడ్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని, క్రీడా రంగంలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్రఒలింపిక్ సంఘం ప్రధానకార్యదర్శి పి మల్లారెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన తెలంగాణ జూడో అసోసియేషన్ సమావేశానికి హాజరయ్యారు. అంతకుముందు విలేకరులతో మాట్లాడారు. ఒలింపిక్ సంఘంలో గుర్తింపు ఉన్న సంఘాలకు మాత్రమే ప్రాతినిధ్యం ఉంటుందని, అక్రమపద్ధతుల్లో ఏర్పడే సంఘాలకు మనుగడ లేదని అన్నారు. ఇటీవల ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పటైందని, ఏర్పాటైన కొద్ది నెలల్లోనే తెలంగాణలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడల సందర్భంగా తెలంగాణ అథ్లెట్లకు డీఏ రూ.250 నుంచి రూ.500 పెంచేలా కషిచేసినట్లు చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు గతంలో వరుసగా రూ.5లక్షలు, రూ.3లక్షలు ఇవ్వగా, ఈ సంవత్సరం నుంచి రూ.10లక్షలు, రూ.7లక్షలు, రూ.5లక్షలు ఇచ్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. 2026లో తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణ ఒలింపిక్ సంఘం కృషి చేసినట్లు చెప్పారు. క్రీడాసంఘాల మధ్య ఏర్పడుతున్న విభేదాలను పరిశీలించనున్నామని, అన్ని క్రీడాసంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు క్రీడలకు 370కోట్ల రూపాయలు కేటాయించడం అభినందనీయమన్నారు.

తెలంగాణలో జూడో క్రీడాభివృద్ధికి కృషి

● శాసనమండలి డిప్యూటీచైర్మన్, తెలంగాణ జూడో సంఘం చైర్మన్ బండ ప్రకాశ్




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర జూడో సంఘం చైర్మన్ బండ ప్రకాశ్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా జూడో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ జూడో అసోసియేషన్ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని హోటల్ మైత్రీలో తెలంగాణ జూడో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జూడో క్రీడాకారులకు కొదవలేదని, భవిష్యత్‌లో ఒలంపిక్‌స్థాయికి ఎదగాలన్నారు. 38వజాతీయస్థాయి క్రీడల్లో తెలంగాణ జూడోక్రీడకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరు జూడోలో శిక్షణ తీసుకోవాలన్నారు. తెలంగాణ జూడో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండ రాజ్‌కుమార్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జూడో క్రీడకు సంబంధించి త్వరలోనే అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.జూడో అసోసియేషన్ కోశాధికారి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన బండ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కడారి అనంతరెడ్డి (కరీంనగర్), పబ్బతి బాలరాజు(యాదాద్రి భువనగిరి), బాదినేని రాజేందర్‌రెడ్డి(జగిత్యాల), మాటేటి సంజీవ్‌కుమార్(పెద్దపల్లి), సంయుక్త కార్యదర్శులుగా రాయిరెడ్డి శంకర్‌రెడ్డి(సిద్దిపేట), సిలివేరి మహేందర్(పెద్దపల్లి), తిప్పారపు సత్యానారాయణ (రాజన్న సిరిసిల్ల), చందనగిరి నాగరాజు(వరంగల్), కోశాధికారిగా రాయిరెడ్డి మహేందర్ రెడ్డి(సిద్ధిపేట), కార్యవర్గ సభ్యులుగా ఎ సాయిచరణ్(ఆదిలాబాద్), సైసాయి కిరణ్(నిర్మల్), కెతిరుపతిగౌడ్(రాజన్నసిరిసిల్ల), కెరాకేష్ (ఆసిఫాబాద్), ఎ రమేశ్‌రెడ్డి(మంచిర్యాల), ఎం శ్రీనివాస్(జగిత్యాల) ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో తెలంగాణ జూడో సంఘానికి చైర్మన్‌గా తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి జాయ్ వర్గీస్ కె, తెలంగాణ ఒలపిక్ సంఘం నుంచి పి.మల్లారెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ నుంచి వి.శ్రీనివాస్ ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. నూతన కార్యవర్గం నాలుగేళ్లపాటు పనిచేస్తుందని ఎన్నికల అధికారి ఎన్.పరమేశ్వర్ ప్రకటించారు.

బీజేపీకి సవాల్..



● పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల్లో గట్టి పోటీ
● కేంద్రమంత్రి సంజయ్ సారథ్యంలో ప్రయత్నాలు
● ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న బీజేపీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో అధికారం కైవసం చేసుకోవాలని ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలో జరుగుతున్న కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు, ఉపాధ్యాయ స్థానం గెలుచుకోవడం ద్వారా రాష్ట్రంలోని విద్యావంతులందరూ బీజేపీ వైపే చూస్తున్నారని సంకేతాలివ్వడానికి తహతహలాడుతోంది. బీజేపీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో గెలిచినవారే కావడంతో ఈ రెండు స్థానాలను గెలుచుకోవడం ఆ పార్టీకి అత్యంత అవసరంగా మారింది. ఈ ప్రాంతంలో తమకు ఆదరణ ఉందని నిరూపించుకోవడానికి ఈ ఎన్నికల విజయం దోహదపడుతుందని భావిస్తున్నారు. లేకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దీని ప్రభావం ఉంటుందని ఆ పార్టీ భావిస్తున్నది. ఈ కారణంగా ఈ పట్టభద్రుల, ఉపాధ్యాయ స్థానాలలో గెలుపును సవాల్‌గా తీసుకుంటున్నది.

50 మంది ఓటర్లుకు ఒక బాధ్యుడు



కాంగ్రెస్‌పార్టీ కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ ప్రచారంలో కొంత వెనుకబడినా ఇప్పుడిప్పుడే క్షేత్ర స్థాయిలో ప్రత్యేక కార్యాచరణతో కదులుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో చిన్న మైల్ అంజిరెడ్డిని, ఉపాధ్యాయ స్థానంలో మల్క కొమురయ్యను అభ్యర్థులుగా రంగంలోకి దింపింది. కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీలు ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, ధన్‌పాల్‌సింగ్, రాకేశ్‌రెడ్డి, రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, డాక్టర్ హరీష్‌తో పాటు ముఖ్యనాయకులను, క్రియాశీలంగా వ్యవహరించే నేతలకు గెలుపు బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే ఆ పార్టీ శ్రేణులు నియోజకవర్గ పరిధిలో ఉన్న పట్టభద్రుల స్థానంలో, ఉపాధ్యాయ స్థానంలో ఉన్న ఓటర్లను బూత్ స్థాయిలో గుర్తించి వారి ఫోన్ నెంబర్లతో సహా వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. 25 నుంచి 50 మంది ఓటర్లకు ఒక బాధ్యుడిని నియమించి అతని ద్వారానే ఓటు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. పార్టీ ప్రచార బాధ్యతను ఓటరును సానుకూల పరిచి పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చి ఓటు వేయించే బాధ్యతను ఆయా గ్రామ శ్రేణులకు అప్పగించారు.

ఆత్మీయ సమ్మేళనాలు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశాలు



అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశాలు నిర్వహించి అనుసరించవలసిన విధానాలను వివరించారు. మండల స్థాయిలో ఓటర్ల సమావే శాలు కూడా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నట్లు సమా చారం. కాంగ్రెస్ పార్టీ కూడా ఓటర్లను కలువడానికి ఇదే విధానాలను అవలం బిస్తుండడంతో పోటాపోటీ వాతావరణం నెలకొంటు న్నది. కేంద్రమంత్రితోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నేతలు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఇక్కడి గెలుపు వారందరికి సవాల్‌గా మారింది.

ప్రచారానికి దూరంగా సీనియర్లు

కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహతోపాటు 23 మంది ఎమ్మెల్యేలు కూడా పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి విజయం కోసం కృషిచేస్తున్నారు. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మక పోటీ సాగుతున్నదనే చర్చ జరుగుతున్నది. 2019లో జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల స్థానంలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి సుగుణాకర్‌రావుకు 15,077 ఓట్లు పోలయ్యాయి. ఆయన అప్పుడు మూడో స్థానంలో ఉండగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి 56,698 ఓట్లు సాధించి గెలుపొందారు. ఇప్పుడు ఆశావహులు పోటాపోటీగా ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టిన ఫలితంగా 3,55,159 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. 27,088 మంది ఉపాధ్యాయ ఓటర్లుగా ఉన్నారు.

ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేయడానికి కరీంనగర్‌కు చెందిన కిసాన్ మోర్చా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి సుగుణాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మంచిర్యాలకు చెందిన రఘునాథ్‌రావు ప్రయత్నాలు చేశారు. పార్టీ పట్టభద్రుల అభ్యర్థిగా అంజిరెడ్డిని తెరపైకి తెచ్చింది. సుగుణాకర్‌రావు, రామకృష్ణారెడ్డి ఇప్పటి వరకు ఎక్కడా పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారంలో కనిపించడం లేదు. వారు అభ్యర్థి ఎంపిక విషయంలో అసంతృప్తితో ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ అభ్యర్థి గెలుపు బాధ్యతను తీసుకోవడం, పార్టీకి అనుబంధంగా ఉండే పలు విభాగాలు, సంస్థలు అంకిత భావంతో పనిచేసేతత్వంగల నాయకులు, కార్యకర్తలు ఉండడం పార్టీ ఆలోచనపరులు వేరే వారికి ఓటు వేసే అవకాశం లేక పోవడం పార్టీ అభ్యర్థికి కలిసివచ్చే అంశాలుగా నిలుస్తున్నాయి. ఉపాధ్యాయ స్థానంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఒక్కరే రాజకీయ అభ్యర్థి కావడం గమనార్హం. మిగతావారంతా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పోటీలో ఉన్నారు. ఈరెండు స్థానాలను పక్కాగా సాధించుకుంటామనే ధీమాతో బీజేపీ వ్యవహరిస్తుండగా, అధికార కాంగ్రెస్‌పార్టీ కూడా అంతే ధీమాను ప్రదర్శిస్తుండడం ఆసక్తికరంగా మారింది.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను విద్యార్థులు తిప్పికొట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మికభవనంలో ఏఐఎస్ఎఫ్ జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశం కుర్ర రాకేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం, యూజీసీ ప్రతిపాదనలతో విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలను విద్యార్థులు తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రబడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగ హామీల అమలుకు నిధులను కేటాయించాలని అన్నారు. తెలంగాణలో నూతన ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం గడుసున్నా విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఉన్న గురుకులాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని, కేజీబీవీ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలని పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గంకు ఎన్నికలు జరగాయి. జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, కార్యదర్శి మంద అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య, మల్యాల శ్రీజా, పుట్టి సాత్విక్, సహాయ కార్యదర్శులు మల్లమరి జాషావా, పెంట భరత్, కే శ్రీనివాస్, 12 మంది కమిటి సభ్యులను ఎన్నుకున్నారు.

కుల గణన పేరుతో బీసీలను తగ్గించేందుకు కుట్ర

● ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోన్న కాంగ్రెస్ సర్కార్
● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పక్కన అభివాదం చేస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, పాల్గొన్న తపస్ నాయకులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుల గణన పేరుతో 60లక్షలమంది బీసీలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లో తపస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మెళనం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటం తథ్యమన్నారు. పదిసీట్లలో ఉపఎన్నికలువస్తే ఏడింటిలో బీజేపీ గెలువడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందేనని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలల్లో అసమ్మతి రగులుతోందని, కొందరు రహస్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. హిందూజాతిలో ముస్లింలను ఎలా కలుపుతారని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముస్లింలకు నాలుగుశాతం ఇస్తేనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు గెలువాల్సిన స్థానాల్లో ఎంఐఎం గెలిచిందన్నారు. పదిశాతం ఇస్తేపరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యోగ, ఉపాధ్యాయులు జీతాలకోసం అడుక్కునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీతం నుంచి దాచుకున్న జీపీఎఫ్ సొమ్మునుకూడా ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని విమర్శించారు. పీఆర్సీ సహా ఏ సమస్యనూ పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వం ఇదన్నారు. డీఏలు, జీపీఎఫ్, మెడికల్ గ్రాట్యుటి పేరిట ఉద్యోగులకు ప్రభుత్వం రూ. 8,200 కోట్ల బకాయి ఉన్నదన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం రూ.11వేల కోట్లుచెల్లించలేని దుస్థితి ప్రభుత్వాని దన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం పోరాటం చేసింది బీజేపీ మాత్రమే అన్నారు. సమావేశంలో టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, తపస్ నాయకులు పాల్గొన్నారు.

రాజన్న హుండీల లెక్కింపు

● 15 రోజులకు రూ.1.69 కోట్ల నగదు
● 116 గ్రాముల బంగారం, 9.80 కిలోల వెండి



డబ్బులను లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిహుండీలను బుధవారం లెక్కించారు. ఆలయ ఆవరణలోని ఓపెన్‌స్లాబ్‌లో ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీలను విప్పి లెక్కించారు. 15రోజుల హుండీలను లెక్కించగా రాజన్న ఖజానాకు రూ. కోటి 69లక్షల 76వేల867 నగదు, 116 గ్రాముల బంగారం, 9కిలోల 800గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, ఎస్పీఎఫ్ సిబ్బంది, హోమ్‌గార్డ్స్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. హుండీ లెక్కింపులో శ్రీశివ రామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



విజ్ఞాన భాండాగారం కేంద్ర గ్రంథాలయం

పాఠకులకు అందుబాటులో 76,785 పుస్తకాలు

విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగకరం

దిన, వార, పక్ష, మాస పత్రికలు.. 10,105 సభ్యత్వాలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవి వస్తోంది.. మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో సెలవులొస్తాయి. మధ్యాహ్నం ఎండ సమయంలో తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థులు జ్ఞాన సముపార్జనకు మంచి పుస్తకాలు చదవాలి. ఇందుకోసం సమీపంలోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి. సెలవుల్లో విద్యార్థులతోపాటు పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.ఈ నేపథ్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, అనుబంధంగా పిల్లల గ్రంథాలయంతో పాటు 11 మండలాల్లో ఉన్న గ్రంథాలయాల్లో సభ్యత్వం పొందడం, పుస్తకాల వివరాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

పుస్తకాలు.. సభ్యులు..

జిల్లా పరిధిలో కేంద్ర గ్రంథాలయం, అందులోని చిల్డ్రన్ లైబ్రరీ, 11 మండలాల్లో కలిపి వివిధ భాషలకు చెందిన 2 లక్షల 8 వేల 399 పుస్తకాలు, ఒక్క కేంద్ర గ్రంథాలయంలో 76,785 పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష, మాస పత్రికలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రంలోనే 10,105 మంది సభ్యులుండగా 11 మండలాల్లో 5 వేల 939 మంది సభ్యులున్నారు.

సభ్యత్వం పొందడం ఇలా

ఏప్రిల్ 2024 నుంచి సభ్యత్వ రుసుము 300 రూపాయలు చేశారు. ఆ రుసుము చెల్లించి, ఆధార్ కార్డ్ జిరాక్స్ ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అందజేస్తే జీవితకాల సభ్యత్వం పొందవచ్చు. డిజిటల్ సభ్యత్వ గుర్తింపు కార్డు కూడా ఇస్తారు. తమకు కావాల్సిన పుస్తకాలను ఇంట్లో కూడా చదువుకొని రెండు వారాల గడువులో తిరిగి గ్రంథాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. పోటీ పరీక్షల పుస్తకాలు, 6 నుంచి డిగ్రీ స్థాయి వరకు పుస్తకాలు, గైడ్లను గ్రంథాలయంలోనే చదువుకోవాల్సి ఉంటుంది. ఆయా మండలాల్లో అక్కడే సభ్యత్వం పొందవచ్చు.

సమయాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ప్రతి శుక్రవారం, ప్రభుత్వ సెలవు దినాల్లో లైబ్రరీ సేవలుండవు. స్టడీ అవర్స్ మాత్రం ప్రతి రోజు 24 గంటల పాటు నిర్వహిస్తారు. మండలాల్లోని గ్రంథాలయాలు ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి.

కేంద్ర గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. సభ్యత్వ నమోదు, మౌలిక వసతుల కల్పన, విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకుల ప్రయోజనం కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కార్యదర్శి సరితతో పాటు సిబ్బంది ప్రత్యేక చొరవ కనబరుస్తున్నారు. పోటీ పరీక్షల అభ్యర్థుల రిలాక్స్ కోసం ప్రతి రోజూ చైర్మన్ తన సొంత ఖర్చులతో తేనీరు అందిస్తున్నారు. సభ్యులకు డిజిటల్ కార్డులను మంజూరు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్తగా వస్తున్న పుస్తకాలను తెప్పిస్తున్నారు. డీసీఎల్‌లో ఇంటర్‌నెట్, వైఫై సదుపాయం ఉంది. ఒక నెలలో డీసీఎల్‌లో ఉన్న పుస్తకాల పేర్లు, సంఖ్య వివరాలు బార్‌కోడ్‌తో సహ డాటాలో ఎంట్రీ చేయనున్నారు. మెంబర్‌షిప్ కార్డులను కూడా సిస్టంలో డిజిటలైజేషన్ పూర్తి చేస్తున్నారు.



కరీంనగర్ గ్రంథాలయ ముఖ ద్వారం


మహాశివరాత్రి జాతరకు ముమ్మర ఏర్పాట్లు

● ఆలయ ఆవరణలో వేగంగా జరుగుతున్న పనులు
● ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు



ఆలయ గుడి చెరువులో శివార్చన వేదిక వద్ద ఏర్పాట్లను చేస్తున్న సిబ్బంది, (ఇన్‌సెట్లో) ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్న సూచికలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరోనాలుగు రోజులు మాత్రమే మిగిలివుండటంతో జాతరఏర్పాట్లను అధికారులు వేగవంతంగా చేస్తున్నారు. రాజన్న ఆలయానికి మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని సుమారు నాలుగులక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ గడిచెరువులో భక్తులను అలరించేందుకు సుమారు 800మంది కళాకారులతో ప్రదర్శన నిర్వహించేందుకు శివార్చన వేదికను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు వీక్షించేందుకు చలువ పందిళ్లను భారీగా ఏర్పాటుచేసి ఎక్కడ కూడా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్స్, పోలీస్‌సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతున్నారు. రాజన్నఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, డీఈ రఘునందన్‌లు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వాహనాల్లో జాతరకు వచ్చేభక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పట్టణశివారు నుంచి వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలం గుర్తించేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తూ, పట్టణ వ్యూమ్యాప్‌నుసైతం ఫ్లెక్సీల రూపంలో భక్తులకుఅందుబాటులోకి తీసుకవస్తున్నారు. ప్రధానకూడళ్లవద్ద ఫ్లెక్సీలుఏర్పాటు చేయడంతో భక్తులు సులువుగా పార్కింగ్‌స్థలాలకు చేరుకునేలా సిద్ధం చేస్తున్నారు. రాజన్న ఆలయంలోని గోపురాలకు, విద్యుత్ దీపాలు, పార్కింగ్ ఏరియా, సైన్‌బోర్డ్స్‌ఏర్పాటు చేస్తున్నారు.



బీజేపీకి సవాల్..

నలుగురు బీజేపీ ఎంపీలు.. ఏడుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో ఈ స్థానాలు గెలవడం కమలనాథులకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సారథ్యంలో ఆ పార్టీ కార్యాచరణను రూపొందించింది. ప్రతి 50 మంది ఓటర్లకు ఒక బాధ్యుడిని నియమించింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు బీజేపీ నాయకులు నిర్వహిస్తున్నారు. పార్టీ అనుబంధ విభాగాలను ప్రచారంలో భాగస్వాములను చేస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

7



- పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల్లో గట్టి పోటీ
- కేంద్రమంత్రి సంజయ్ సారథ్యంలో ప్రయత్నాలు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

శివాజీ స్ఫూర్తితో హిందువులు ఐక్యతచాటాలి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

భగత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో హిందువుల ఐక్యత చాటాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డితో కలిసి ఛత్రపతి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల ఐక్యతే శివాజీ జీవిత సందేశమన్నారు. హిందు సమాజాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు ఎన్ని చేసినా, హిందు ధర్మం మీద దాడుల చేస్తుంటే ఎదిరించిన వీరుడు శివాజీ అన్నారు. వర్గల్ మండలం జబ్బాపూర్ గ్రామంలో శివాజీ జయంతి సందర్భంగా జెండా ఎగురవేస్తుండగా కరెంట్ వైర్లు తగిలి ప్రశాంత్ అనే యువకుడు మరణించడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దర్జాగా ఆక్రమణలు

- రోడ్లు, ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు
- ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- పట్టించుకోని అధికారులు



కూరగాయల మార్కెట్ రోడ్డు మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద ఫుట్‌పాత్‌పై దుకాణదారుల సామగ్రి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆక్రమణలకు అడ్డూ, అదుపు లేకుండా పోయింది. ప్రక్కడ చూసినా రోడ్లు, ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు దర్జాగా కబ్జా చేసి వ్యాపారాలను సాగిస్తున్నారు. ఆయా దుకాణాలకు వచ్చే వాహనదారులు రోడ్లపైనే వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. నగరంలోని 14.5 కిలోమీటర్ల ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారులతోపాటు స్మార్ట్‌సిటీ రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఫుట్‌పాత్‌లు పాదచారుల కోసమని, రోడ్లు వాహనదారుల కోసమని చెప్పడమే కానీ ఎక్కడ కూడా ఫుట్‌పాత్‌లపై పాదచారులకు నడిచే వీలుండడం లేదు.

దీంతో ఫుట్‌పాత్‌లు దుకాణాల బోర్డులు, సామాగ్రి, వాహనాలతో నిండిపోతున్నాయి. మరోవైపు వీధి వ్యాపారులు, పండ్ల అమ్ముకునే వారు తోపుడు బండ్లను, ఆటోలు, ఇతర వాహనాలను రోడ్లపైనే పెట్టి అమ్మకాలు చేస్తున్నారు. దీంతో కొనుగోలు దారులు రోడ్లపైనే వాహనాలను నిలిపి వేయాల్సి వస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, ఇతర రోడ్లు వాహనాలతో నడిరోడ్డు వరకు నిండిపోవడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రైవేట్ పాఠశాలల స్కూల్ వ్యాన్లు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగుల వాహనాలతో ఏ రోడ్డునుంచి వెళ్లాలన్నా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది.

అటవీశాఖ కార్యాలయం నుంచి జగిత్యాల రోడ్డులో రేకుర్తి వరకు రోడ్డుకు ఇరువైపులా ఇదే పరిస్థితి. జ్యోతినగర్ నుంచి శాతవాహన యూనివర్సిటీ వరకు మధ్యలో సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం సమీపంలో రోడ్డుపైనే టిఫిన్‌సెంటర్లు, తోపుడుబళ్లు ఏర్పాటు చేస్తున్నారు. మద్యం దుకాణాల ఎదుట రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. అంబేద్కర్ స్టేడియం సమీపంలో ఇదే పరిస్థితి. రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నా పోలీసులు, మున్సిపల్ అధికారులు అడపాదడపా తొలగించాలని ఆదేశించడం, ఒకటిరెండురోజుల్లో మళ్లీ ఆక్రమించడం పరిపాటిగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనైనా ఆక్రమణలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.







మదీనా కాంప్లెక్స్ వద్ద ఫుట్‌పాత్‌పై దుకాణదారుల సామగ్రి, టవర్ సర్కిల్ వద్ద రోడ్లపై అమ్మకాలు, అంబేద్కర్ స్టేడియం సమీపంలో రోడ్డుపై ఆక్రమణలు

తాగునీటి సరఫరా సక్రమంగా జరగాలి

- తరచూ లీక్ అవుతున్న పైపులైన్లను మార్చండి
- మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



హౌసింగ్‌బోర్డుకాలనీలోని రిజర్వాయర్‌లో నీటి సరఫరాపై అధికారులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్ బోర్డుకాలనీలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన 24/7 నిరంతర తాగు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె హౌసింగ్‌బోర్డుకాలనీలోని రిజర్వాయర్‌ను సందర్శించి, నిరంతర నీటి సరఫరా తీరుపై సమీక్ష నిర్వహించారు. కాలనీలోని కొన్ని చోట్ల పాతపైపులైన్లు తరచూ లీక్ అవుతున్నందున అలాంటి వాటిని గుర్తించి వెంటనే కొత్త పైపులైన్లు వేయాలని, లీకేజీలను వెంట వెంటనే అరికట్టాలని ఆదేశించారు. నల్లానీరు తక్కువ ప్రెషర్‌తో వస్తుం దనే ఫిర్యా దులు అందుతున్నందున అందుకు కారణాలను గుర్తించి, సమస్యను పరిష్కరించాలని సూచించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది రాకుండా, సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రాజ్‌కుమార్, డీఈలు ఓంప్రకాశ్, వెంకటేశ్వర్లు, అయాబ్‌ఖాన్, స్మార్ట్‌సిటీ పీఎంసీ సందీప్‌కుమార్, ఏజెన్సీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలి

కరీంనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని, 5 నుంచి 15 సంవత్సరాలలోపు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని యూఐడీఏఐ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ చైతన్యరెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా స్థాయి ఆధార్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. యుఐడీఏఐ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ చైతన్యరెడ్డి వర్చువల్‌గా సమావేశం పాల్గొని జిల్లాకు సంబంధించి నమోదు పూర్తయిన ఆధార్ గణాంకాలను తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన వారి ఆధార్ నమోదుకు సంబంధించి తహసీల్దార్ల లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ కోసం పాఠశాలల్లో క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని అనాథ శరణాలయాల్లో పెరుగుతున్న వారికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌లో వచ్చే సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ డైరెక్టర్‌ను కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె సబిత, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీఈవో జనార్దన్‌రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ అంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా మత్స్యగిరీంద్రస్వామి శోభాయాత్ర



శోభాయాత్ర వాహనంపై స్వామి వారి ఉత్సవమూర్తులు

శంకరపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగట్టు, గొల్లపల్లి గ్రామాల్లో భూదేవి, నీలదేవి సమేత మత్స్యగిరీంద్రస్వామి శోభాయాత్ర బుధవారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవ మూర్తులను అలంకరించి ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామ పర్యటన అనంతరం ఉత్సవ మూర్తులను పాలకవర్గం ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ ప్రవేశం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే కందులకు మద్దతు ధర



గంగాధరలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

గంగాధర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే కందులకు మద్దతు ధర లభిస్తుందని డీసీఎంఎస్ ఏబీఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గంగాధర వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ కందుల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాలు, కల్తీ గింజలు లేకుండా నాణ్యమైన కందులను మార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతు ధర క్వింటాల్‌కు 7,550 రూపాయలు పొందాలన్నారు. కందులు అమ్మకానికి తీసుకు వచ్చే రైతులు పట్టదారు పుస్తకం, బ్యాంకు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు వ్యవసాయాధికారుల ధ్రువీకరణ పత్రం తప్పని సరిగా తీసుకురావాలన్నారు. మార్కెట్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఇన్‌చార్జిలు కుమారస్వామి, నర్సింగరావు, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ లక్ష్మణ్, మార్క్‌ఫెడ్ సిబ్బంది, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

పది, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధశాఖల అధికారులతో పది, ఇంటర్ పరీక్షలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. హైదరాబాద్ నుంచి ఇంటర్ పరీక్షలపై పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరికీ పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతి ఉండదన్నారు. ప్రశ్నపత్రాలను కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గుర్తింపు పొందిన వారిని తప్ప ఎవరినీ కేంద్రాల్లోకి అనుమతించవద్దని ఆదేశించారు. పది, ఇంటర్ పరీక్షల సమయంలో ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు కలెక్టర్ సూచించారు. పరీక్ష వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీసులకు, పరీక్షా కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి 5 నుంచి 22 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఫస్ట్ ఇయర్ 17,799 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు 17,763 మంది విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. వీరు పరీక్ష రాసేందుకు వీలుగా జిల్లాలో 68 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, కరీంనగర్‌లోనే 37 కేంద్రాలుంటాయన్నారు.

డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ వరకు జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మొత్తం 12,516 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరువుతు న్నందున 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో వెంకటరమణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

శంకరపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకరపట్నం మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని పార్టీలకు కమ్యూనిస్టులే దిక్సూచి అన్నారు. నేరస్తులు చట్ట సభల్లో ప్రాతినిధ్య వహించడంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోతుందన్నారు. నాడు దున్నే వాడికే భూమి చెందాలని పోరాడిన పార్టీ ఎర్ర జెండా పార్టీ అన్నారు. పేద లు, కూలీల పక్షాన ఉండి వారి సమస్యలపై అనునిత్యం పోరాటం చేస్తున్నామ న్నారు. ప్రతి ఒక్కరికి కనీస సదుపాయాలతో పాటు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత, పరిపాలించే బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. నిత్యావసర ధరలు ఆకాశ న్నంటాయని, అడిగితే హక్కులు నెరవేరవని, పోరాడి సాధించుకోవాలన్నారు. కమ్యూనిస్టులు ప్రశ్నించే గొంతుకలై సమరశీల పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నందున లౌకిక ప్రజాస్వామ్యవాదులైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతిస్తున్నామని స్పష్టం చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, జగిత్యాల జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొన్నగంటి కేదారి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంటరెడ్డి, కటికరెడ్డి బుచ్చన్న, యుగంధర్, సాగర్, సదానందం, రవి, రామస్వామి, తిరుపతి, నరేష్, శ్రీనివాస్, అంజయ్య, లక్ష్మణ్, లింగయ్య, కుమార్, తిరుపతి, రాజేశ్వరి, రజిత, రమాదేవి, లత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు